క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోళ్లను ప్రారంభిస్తున్న మధు

కరీంనగర్ అర్బన్: కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్, డీఎంవో వి.పద్మావతి, డైరెక్టర్లు కర్నాటి చలమయ్య, పబ్బతి రంగారెడ్డి, గుంటి రాజమల్లు, సోమిరెడ్డి లక్ష్మారెడ్డి, గోలి మల్లయ్య, గంగాధర లస్మయ్య, గుండేటి అనిత, చంద్రపల్కల అంజయ్య, బోనాల జనార్దన్, మహమ్మద్ మహముద్ పాషా, విజయ్ కుమార్ ముందడా, శివనాథుని వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పురుషోత్తం, పీఏసీఎస్ సీఈవో రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు

కరీంనగర్‌రూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ల పరిష్కారం కోసం శనివారం నుంచి సమ్మె చేస్తుండటంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. కరీంనగర్ మండలంలో మొత్తం 11 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్న గ్రామాలకు సీనియర్ పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ ఉద్యోగులను ఇన్‌చార్జిలుగా నియమించినట్లు ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఎస్.వెంకటస్వామి సీనియర్ అసిస్టెంట్‌కు దుబ్బపల్లి, ఎండీ ఆరీఫోద్దీన్ జూనియర్ అసిస్టెంట్‌కు మొగ్దుంపూర్, మందులపల్లి, బి.మోహన్ టైపిస్టుకు తాహెర్‌కొండాపూర్, దుర్శేడ్ సీనియర్ పంచాయతీ కార్యదర్శికి వి. సంజీవరెడ్డికు చేగుర్తి, నల్లగుంటపల్లి, ఎండీ.హిదైతుల్లాకు బొమ్మకల్, డి.కవితకు ఇరుకుల్ల, ఎం.కిరణ్‌కుమార్‌కు చెర్లభూత్కూర్, పి.మల్లయ్యకు చామనపల్లి, రికార్డు అసిస్టెంట్ కె.సాయిలుకు ఫకీర్‌పేట, బిల్‌కలెక్టర్ జి.రేణుక కు బహదూర్‌ఖాన్‌పేట పంచాయతీలకు ఇన్‌చార్జి కార్యదర్శులుగా నియమించినట్లు వివరించారు.

దళితబంధు అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు

కొత్తపల్లి: దళితబంధు లబ్ధిదారుల నుంచి లంచం తీసుకున్న ఎమ్మెల్యేలు, వారి అనుచరులపై చట్టప్రకారం చర్యలు తీసుకొని అసలైన లబ్ధిదారులకు దళితబంధు పథకం అమలు చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. దళితబంధు అవినీతి పరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం కొత్తపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ దళితబంధు లబ్ధిదారుల నుంచి లంచం తీసుకున్న ఎమ్మెల్యేలు, వారి అనుచరుల చిట్టా ఉందని బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల సమావేశంలో సీఎం కేసీఆర్ స్వయంగా వ్యాఖ్యానించడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే అవినీతి చిట్టా విడుదల చేసి ఎమ్మెల్యేలను పదవుల నుంచి తొలగించి వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ మోర్చా నాయకులు నలువాల మహేశ్, ఎర్రోళ్ల ప్రశాంత్, బి.శ్రావణ్‌కుమార్, నరేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దళితమోర్చా నాయకుల వినతి

శంకరపట్నం: దళితబంధు పేరిట డబ్బులు వసూళ్లు చేస్తున్న ఎమ్మెల్యేలు, అనుచరులపై చర్యలు తీసుకోవాలని జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్‌కు దళితమోర్చా నాయకులు వినతిపత్రం అందజేశారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కొత్తపల్లి: పండ్లు కోస్తూ ఇటీవల ప్రమాదానికి గురై గాయపడి చికిత్స పొందుతున్న గట్టు మల్లయ్య శనివారం మృతి చెందినట్లు కొత్తపల్లి ఎస్సై బి.ఎల్లయ్యగౌడ్ తెలిపారు. ఆరెపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య సీతారాంపూర్‌లోని అల్లనేరెడు చెట్టుపైనున్న పండ్లు కోసేందుకు ఆటోపైకి ఎక్కాడు. పండ్లు కోస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ఆటోపై నుంచి కిందపడగా కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెడ నరాలు దెబ్బతినడంతో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని, మృతుడి కుమారుడు సంపత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

స్విమ్ జర స్విమ్..!

సండే స్పెషల్

- నగరంలో స్విమ్మింగ్‌కు పెరిగిన ఆసక్తి
- స్విమ్మింగ్ పూల్స్‌లో చిన్నారుల సందడి
- వేసవి ఉపశమనానికి ఈత బాట



కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలోని స్విమ్మింగ్ పూల్‌లో చిన్నారుల సందడి

కరీంనగర్‌స్పోర్ట్స్: ఓ పక్క భానుడి భగభగ మండుతుంటే దాని నుంచి ఏ విధంగా తప్పించుకోవాలని చూస్తుంటారు చాలా మంది. దానికి ఉపశమనం ఒక్క స్విమ్మింగ్ తోనే సాధ్యమంటున్నారు. దీంతో ఆఫీసుల్లో పని ముగించుకొని తల్లిదండ్రులు తమ పిల్లలను వెంటేసుకొని స్విమ్మింగ్‌పూల్‌ల బాట పడుతున్నారు. దీనికి తోడు పాఠశాలలకు వేసవి సెలవులు ఇవ్వడంతో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు స్విమ్మింగ్ నేర్పించడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. పలువురు దేహదారుఢ్యం కోసం, వేసవి ఉపశమనం కోసం స్విమ్మింగ్ చేస్తుండడటంతో నగరంలోని స్విమ్మింగ్ పూల్స్ కళకళలాడుతున్నాయి.

ఈతతో లాభాలెన్నో..

స్విమ్మింగ్‌తో చాలా లాభాలున్నాయి. ఎండ నుంచి ఉపశమనమే కాకుండా శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఆరోగ్యం బాగుండటమే కాకుండా ఊపిరితిత్తుల కెపాసిటీ పెరుగుతుంది. గుండె దృఢంగా ఉంటుంది. బీపీ, షుగర్ కంట్రోల్‌లో ఉంటుంది. రక్త ప్రసరణ మెరుగవుతుంది. ముఖ్యంగా చిన్న పిల్లల పెరుగుదలకు దోహదపడుతుంది.

సందడిగా స్విమ్మింగ్ పూల్‌లు

వేసవి సెలవులు ప్రారంభం నుంచే నగరంలోని పలు స్విమ్మింగ్ పూల్‌లలో సందడి మొదలైంది. కరీంనగర్‌లోని బీఆర్ అంబేద్కర్ స్టేడియం, కరీంనగర్ క్లబ్‌లోని స్విమ్మింగ్‌పూల్‌లతోపాటు పలు విద్యా సంస్థల్లోని స్విమ్మింగ్‌పూల్‌లు, ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో నడుస్తున్న స్విమ్మింగ్‌పూల్‌లు చిన్నారులతో సందడిగా మారాయి. ఈత నేర్చుకునేందుకు పెద్ద సంఖ్యలో హాజరవుతుండటం విశేషం.





స్విమ్మింగ్ నేర్చుకుంటున్న చిన్నారులు

పేరెంట్స్ ఎంకరేజ్‌తో..



సమ్మర్ వచ్చిందంటే స్విమ్మింగ్ చేయాలంటూ పేరెంట్స్ ఎంకరేజ్ చేస్తారు. నేను కూడా సమ్మర్ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తా. స్విమ్మింగ్ చేస్తే ఎంతో హ్యాపీగా ఉంటుంది. గతేడాది కంటే ఈసారి చాలా మంది నేర్చుకుంటున్నారు. – శివ కార్తికేయ

సమ్మర్ ఉపశమనానికి..



వేసవి తాపం తీరాలంటే స్విమ్మింగ్ ఎంతో ఉపయోగపడుతుంది. స్విమ్మింగ్‌పూల్‌లలో సందడి ఉంటుంది. అటు వేడికి తట్టుకోలేక కొందరు స్విమ్మింగ్‌కు వస్తుండగా.. పిల్లలు సెలవుల్లో స్విమ్మింగ్ నేర్చుకోవడానికి వస్తున్నారు. – జి లావణ్య, పేరెంట్

ఆసక్తి పెరిగింది



కరోనా కారణంగా వేసవి సెలవుల్లో మూడేళ్లు స్విమ్మింగ్ చేయలేకపోయా. ఈ సంవత్సరం ముందస్తుగా సెలవులు రావడం, ఎండ తీవ్రత కూడా ఎక్కువగా ఉండటంతో అందరికీ స్విమ్మింగ్‌పై ఆసక్తి పెరిగింది. రోజూ ఉదయం, సాయంత్రం నాలుగేసి బ్యాచ్‌లు నడుస్తున్నాయి. – కె చంద్రశేఖర్, కోచ్, అంబేద్కర్ స్టేడియం స్విమ్మింగ్‌పూల్

స్విమ్మింగ్ అంటే చాలా ఇష్టం..



స్విమ్మింగ్ అంటే చాలా ఇష్టం. వేసవిలో తప్ప మిగతా రోజుల్లో స్విమ్మింగ్ చేయడం కుదరదు. సమ్మర్ హాలీడేస్ రాగానే స్విమ్మింగ్ చేస్తా. రోజూ సాయంత్రం గంట సేపు స్విమ్మింగ్ చేస్తే ఎంతో రిలాక్స్ అనిపిస్తుంది. – సాయి సంయుధ

ప్రతీ వేసవిలో స్విమ్మింగ్ చేస్తా..



వేసవి సెలవులు రాగానే స్విమ్మింగ్ చేయాలనిపిస్తుంది. ఎంతో రిలాక్స్ అనిపిస్తుంది. అందుకే ప్రతీ వేసవిలో స్విమ్మింగ్ చేస్తా. ఈ సంవత్సరం ఇప్పుడే స్టార్ట్ చేశా. హీట్ చాలా ఉంది. దానికి ఉపశమనం అంటే స్విమ్మింగ్. – సార్థక్ సాయి

పది రోజుల నుంచి వస్తున్న..



సమ్మర్ హాలీడేస్ వచ్చాయి. స్విమ్మింగ్ చేయడమంటే చాలా ఇష్టం. గతేడాది నేర్చుకుందామనుకున్న. కానీ నేర్చుకోలేకపోయా. ఇప్పుడు పది రోజుల నుంచి వస్తున్నాను. చాలా హ్యాపీగా ఉంది. కొంచెం నేర్చుకున్నా. ఇంకా బాగా నేర్చుకొని డీప్‌లో స్విమ్మింగ్ చేస్తా. – మన్‌ప్రీత్ కౌర్

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ పనులు చేపడుతున్నందున ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బృందావనం ఫంక్షన్‌హాల్ వెనుక, కాకతీయ స్కూల్, గౌతమినగర్, శివాలయం వెనుక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు కొనసాగుతున్నందున ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ ప్రతిమ ఫీడర్ పరిధిలోని విద్యారణ్యపురి, సరస్వతీనగర్, హనుమాన్‌నగర్, ఆర్టీసీ కాలనీ, శ్రీనివాసనగర్, చంద్రపురికాలనీ, మాణికేశ్వర్‌నగర్, కేఆర్ కాలనీ, కార్తికేయనగర్, అయోధ్యనగర్, కేసీఆర్ భవన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ జి.శ్రీనివాస్ తెలిపారు. అదేవిధంగా 11కేవీ కొత్తపల్లి ఏడీఎల్ ఫీడర్ నుంచి కొత్తపల్లి టౌన్–2 ఫీడర్‌కు లైన్ల మార్పిడి చేపడుతున్నందున రాణిపూర్, తూర్పువాడ, గోల్‌బంగ్లా, టాకీస్, సహస్ర కళాశాల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు.

మార్కెట్ యార్డు తనిఖీ

చొప్పదండి: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి పద్మావతి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. మార్కెట్ యార్డు ఆవరణలో కొనుగోళ్లను పరిశీలించారు. ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. టర్పాలిన్లపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. రొటేషన్ పద్ధతిలో ఇప్పటి వరకు 125 మంది రైతులకు టర్పాలిన్లు సమకూర్చినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు 3 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు చేసినట్లు తెలిపారు. వారివెంట మార్కెట్ యార్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ఎర్లీబర్డ్ స్కీం

- కరీంనగర్ బల్దియాలో గతేడాదికన్నా పెరిగిన వసూళ్లు
- 2023–24లో రూ.9.15 కోట్లు
- శనివారం ఒక్కరోజే 88.36 లక్షలు
- ఆదివారం మరో రూ.కోటి వసూలయ్యే అవకాశం
- ఇక ట్రేడ్ లైసెన్స్‌లపై ప్రత్యేక దృష్టి

కరీంనగర్‌సిటీ: కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో ఎర్లీబర్డ్ స్కీం ఆదివారంతో ముగియనుంది. ఇప్పటికే ఈ అవకాశాన్ని చాలా మంది వినియోగించుకోగా ఆదివారం చివరి రోజు సెలవు అయినప్పటికీ కౌంటర్లు తెరిచి అందుబాటులో ఉంచుతున్నామని మేయర్ సునీల్‌రావు, కమిషనర్ ఇస్లావత్, అదనపు కమిషనర్ స్వరూపరాణి తెలిపారు.

ఐదు శాతం రాయితీతో..

రాష్ట్రవ్యాప్తంగా ఆస్తి, ఇంటి పన్నులు చెల్లించే వారికి పురపాలక శాఖ రాయితీ అవకాశం కల్పించింది. ఈ క్రమంలో ముందస్తుగా 2023–24 ఏడాదికి ఆస్తి పన్నులు చెల్లించే వారికి ఐదు శాతం రాయితీని ఉపయోగించుకోవాలని సూచించింది. దీనిపై కరీంనగర్ నగర పాలక సంస్థ విస్తృత ప్రచారం చేయడంతో గృహ వినియోగదారులు పెద్ద ఎత్తున ఈ పథకాన్ని వినియోగించుకున్నారు. గతనెల నుంచి ప్రారంభమైన ఈ పథకం ఆదివారంతో గడువు ముగియనుంది.

రూ.9.15 కోట్లు వసూలు

కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో ఎర్లీబర్డ్‌లో భాగంగా 2023–24 సంవత్సరానికి రూ.9.15 కోట్లు వసూలయ్యాయి. గతేడాది కేవలం రూ.7.05 కోట్లు మాత్రమే వచ్చాయి. శనివారం ఒక్కరోజే రూ.88.36 లక్షలు ఆదాయం సమకూరింది. ఆదివారం కూడా పన్నులు చెల్లించేందుకు అవకాశం ఉండటంతో మరో కోటి రూపాయలు వసూలయ్యే అవకాశం ఉందని మున్సిపల్ అధికారులు అంచనా వేస్తున్నారు. వీటితో 2022–23 ఆర్థిక సంవత్సరానికి రూ.33.05 కోట్ల ఆస్తి పన్ను బకాయిలు ఉండగా వాటి నుంచి రూ.28.35 కోట్లు సుమారుగా 86 శాతం వసూలు చేసింది. ఆస్తి పన్నులు సకాలంలో చెల్లించడం వల్ల కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులు వేగంగా చేపట్టే అవకాశం ఉంటుందని మేయర్ సునీల్‌రావు తెలిపారు.

ట్రేడ్ లైసెన్సులపై దృష్టి

ట్రేడ్ లైసెన్సులపై కూడా కఠిన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఈమేరకు ఆలస్యంగా చెల్లించే వారిపై ముఖ్యంగా రెన్యువల్ ఆలస్యమూ మూడు నెలలు దాటిన వాటికి బకాయిలో 50శాతం జరిమానాగా విధించాలని నిర్ణయించారు.

నేడు కూడా చెల్లించవచ్చు..

ఎర్లీబర్డ్ రాయితీని వినియోగించుకునే గృహ యాజమానులు చెల్లింపులు చేసేందుకు ఆదివారం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశాం. ఆస్తిపన్ను ముందస్తు చెల్లింపులు చేసి ఐదు శాతం రాయితీని వినియోగించుకోవాలి. నేడు కోటి రూపాయలు వరకు చెల్లింపులు అయ్యే అకాశం ఉంది.
– స్వరూపరాణి, అదనపు కమిషనర్, కరీంనగర్ కార్పొరేషన్

తాగునీటి సమస్య రాకుండా చర్యలు



మాట్లాడుతున్న చైర్మన్ రాజు

కొత్తపల్లి: కొత్తపల్లి పట్టణంలో మంచినీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు తెలిపారు. కొత్తపల్లిలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు అధ్యక్షతన జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశంలో పట్టణంలోని పలు సమస్యలు, శానిటేషన్, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పెండింగ్ బిల్లులపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలని, శానిటేషన్ ప్రక్రియ క్రమం తప్పకుండా సాగేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. కమిషనర్ కె.వేణుమాధవ్, కౌన్సిలర్లు వాసాల రమేశ్, జేరిపోతుల మెండయ్య, మానుపాటి వేణుగోపాల్, గున్నాల విజయ, ఎస్కే నజియా, స్వర్గం వజ్రాదేవి, చింతల సత్యనారాయణరెడ్డి, వేముల కవిత, కోఆప్షన్ సభ్యులు ఎండీ ఫక్రుద్దీన్, కట్ల మమత, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమ్మె

- మండల పరిషత్ కార్యాలయంలో నిరసన దీక్ష
- రెగ్యులరైజ్ చేయాలని గాంధీ విగ్రహానికి వినతిపత్రం



గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

కరీంనగర్‌రూరల్: గ్రామాల అభివృద్ధిలో కీలకమైన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఆందోళన బాట పట్టారు. డిమాండ్లు నెరవేర్చే వరకు విధుల్లో చేరబోమంటూ శనివారం నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. కరీంనగర్ మండల పరిషత్ కార్యాలయంలో కరీంనగర్‌రూరల్‌లోని 11 మంది, కొత్తపల్లి మండలంలోని ముగ్గురు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నిరసన దీక్షలో పాల్గొన్నారు. ప్రభుత్వం 2019 ఏప్రిల్ 11న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నియమించింది. మూడేళ్ల శిక్షణ కాలం ముగిసిన అనంతరం ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేస్తామని ప్రకటించింది. ఏప్రిల్ 12న రూ.15వేల వేతనంతో విధుల్లో చేరిన కార్యదర్శులకు 2021 సెప్టెంబరులో రూ.28,272 వేతనం పెంచడంతోపాటు శిక్షణ కాలాన్ని ప్రభుత్వం నాలుగేళ్లకు పొడిగించింది. ఈనెల 12న గడువు ముగియడంతో ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో కార్యదర్శులు శనివారం నుంచి విధులకు దూరంగా ఉంటున్నారు.

గాంధీ విగ్రహానికి వినతిపత్రం

డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శులు గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగ క్రమబద్ధీకరణ, మృతి చెందిన కార్యదర్శుల కుటుంబాలకు ఉద్యోగ అవకాశం, ప్రత్యేక జాబ్‌చార్ట్ తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కిరణ్‌కుమార్, ప్రభాకర్, అభినవ్, వాహేజ్, మమత, సల్మాన్, అనిల్, సరిత, అఖిల్, నరేశ్, లావణ్య, స్వప్న, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత మనస్సుతో పరీక్షలకు హాజరుకావాలి



మాట్లాడుతున్న ఏసీపీ తుల శ్రీనివాసరావు

కరీంనగర్ కల్చరల్: ఒత్తిడిని జయంతి ప్రశాంత మనస్సుతో పరీక్షలకు హాజరు కావాలని ఏసీపీ తుల శ్రీనివాసరావు అన్నారు. శనివారం జిల్లా గ్రంథాలయంలో కానిస్టేబుల్‌పరీక్ష రాసే అభ్యర్థులకు నిర్వహించిన శుభాభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్పొరేట్ సంస్థల్లో శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు ధీటుగా గ్రంథాలయంలో క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకున్నారని అన్నారు. తాను పలుసార్లు గమనించినప్పుడు రాత్రి 12 గంటల వరకు మెలకువతో ఉండి చదువుకున్నారని తెలిపారు. ప్రభుత్వం పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తోందని, భయం, అపోహలు వీడాలన్నారు. కష్టపడి చదివిన చదువే విజయతీరాలకు తీసుకెళ్తుందని అన్నారు. అనంతరం ఏసీపీని అభ్యర్థులు పుస్తకమిచ్చి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్, సిబ్బంది సరిత, మల్లయ్య, శ్రీమతి, రాజమల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు పటేల్ శ్రావణ్ రెడ్డి, సోమిరెడ్డి నరేశ్‌రెడ్డి, గంగాధర చందు, గుర్రం సతీశ్, నారగోని శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎఫ్‌బీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న నాయకులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్‌లో మే 6, 7 తేదీల్లో జరుగనున్న ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోమటిరెడ్డి తేజ్‌దీప్‌రెడ్డి, బండారి శేఖర్‌లు అన్నారు. శనివారం కరీంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ మహాసభల అనంతరం మొదటి సరిగా రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు కరీంనగర్‌లో నిర్వహించడం జరుగుతున్నదన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి, నాయకులు కురువల్లి శంకర్, బెక్కంటి రమేశ్, ప్రశాంత్ కుమార్, నాయకులు బద్రి నేత, అరవింద్ పాల్గొన్నారు.

చిత్ర కథ – ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



కరీంనగర్ మండలం ఇరుకుల్ల–ఎలబోతారం దారిలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. గతంలో దూరంగా ఉండగా బీటీరోడ్డు నిర్మాణంతో దగ్గరైంది. దీంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఈదురుగాలులకు చెట్టుకొమ్మ విరిగి, దారిలో వేలాడుతుండటంతో అందరూ తప్పనిసరి పరిస్థితుల్లో ట్రాన్స్‌ఫార్మర్ సమీపం నుంచి వెళ్లాల్సి వస్తోంది. ఎలబోతారం శివారులోని ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. – కరీంనగర్‌రూరల్

రేపటి నుంచి వేసవి శిక్షణ శిబిరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాజ్‌కుమార్

విద్యానగర్(కరీంనగర్): వేసవి సెలవులు వృథా కాకుండా, పిల్లల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీస్తూ వారిలో సృజనాత్మకతను పెంచేందుకు మే 1వ తేదీ నుంచి నెల రోజుల పాటు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కరీంనగర్‌లోని సెయింట్‌పాల్స్ ఉన్నత పాఠశాల డైరెక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత కాలంలో పిల్లలు అన్ని రంగాల్లో నైపుణ్యాన్ని పెంచుకోవడం ద్వారా వారు భవిష్యత్‌లో రాణించగలుగుతారని అన్నారు. 3–5 ఏళ్ల వారికి గాత్రం,డ్యాన్స్, చిత్రలేఖనం, గిటార్, కీబోర్డు, స్టోరీ టెల్లింగ్, ఆర్ట్, క్రాఫ్ట్ అంశాలు, 7–15 ఏళ్ల వారికి కూచిపుడి(బాలికలు), గీతాశ్లోకాలు, కీబోర్డు, గాత్రం, క్రికెట్, షటిల్, చదరంగం, మార్షల్ ఆర్ట్స్‌లో కరాటే బాక్సింగ్, కాలీగ్రఫీ అంశాల్లో అనుభవజ్ఞులైన వారితో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కరీంనగర్‌లోని బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా శిబిరాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో స్కూల్ ప్రిన్సిపాల్ లీలా ప్రియదర్శిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు



ముస్తాబైన ఎల్లమ్మ ఆలయం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో ఆదివారం నుంచి రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గౌడ సంఘం అధ్యక్షుడు మూల లక్ష్మిరాజం తెలిపారు. ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు, మే 1న పుట్టకు ప్రత్యేక పూజలు చేసి పుట్టమన్ను సేకరించి, గౌడ కులస్తుల ఇళ్లల్లో జోగు ఎత్తే కార్యక్రమం. 2న అమ్మవారికి లగ్న పట్నం వేసి ఎల్లమ్మ, జమదగ్ని మహామునికి కల్యాణం,, రాత్రి ఎల్లమ్మ బోనాలతో మహిళలు తరలివస్తారు. 3న నాగవెల్లి పట్నంతో ఉత్సవాలు ముగుస్తాయని, గౌడ కులస్తులందరూ అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.